# పార్టీకి కార్యకర్తలే రథసారథులు

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- బీఆర్ఎస్‌లో పలువురు చేరిక



పాలకుర్తి : బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులతో మంత్రి ఎర్రబెల్లి

పాలకుర్తి, నవంబర్ 15 : మండలంలో హట్యా తండా గ్రామపంచాయతీ, దస్రుగూడెం తండాకు చెందిన పులు సోతు మధు, సిరిసన్నగూడెం గ్రామపంచాయతీ, కంబాలతండా గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బానోత్ బిక్యా, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు గుగులోత్ నరేష్ ఆ పార్టీకి రాజీనామా చేసి మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు కార్యకర్తలే రథసారథులు అని ఆన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో గిరిజన తండాలు, శివారు ప్రాంతాలు, గ్రామాలను సమగ్రాభివృద్ధి చేశామన్నారు. రైతులను మోసం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను పాతరేయాలని ఆయన పిలుపునిచ్చారు.

**మృతుడి కుటుంబానికి మంత్రి పరామర్శ**

పాలకుర్తి మండల కేంద్రానికి బీఆర్ఎస్ నాయకుడు గాయాల యాక య్య బుధవారం మృతి చెందాడు. యాకయ్య మృతదేహంపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పస్నూరి నవీన్‌కుమార్, సర్పంచ్ వీరమనేని యాకాంతారావు తదితరులు పాల్గొన్నారు.

**కార్యకర్తలను కంటి రెప్పలా కాపాడుకుంటా**

రాయపర్తి, నవంబర్ 15 : కష్టకాలంలో పార్టీలో చేరి పార్టీ బలోపేతంతోపాటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని బీఆర్ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. బుధవారం మండలంలోని కొలన్‌పల్లి గ్రామంలోని వడ్డెర కాలనీకి చెందిన సుమారు 30మంది యువకులు, మండలంలోని మహబూబ్‌నగర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కంజెర్ల ఎల్లయ్యతో సహ పలువురు కాంగ్రెస్ నాయకులు మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పాలకుర్తి ప్రజలను మాయమాటలతో మోసం చేసేందుకు వస్తున్న పార్టీలు, నేతలను ప్రజలు విశ్వసించవద్దని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు తిరుమల, మాడభూషణ రంగాచార్యులు, ఆలకుంట్ల స్వామి, గ్రామ అధ్యక్షుడు వంగాల నర్సయ్య, పీపీసీఎస్ వైస్ చైర్మన్ చిట్యాల వెంకటేశ్వర్లు, కాంచనపల్లి వనజారాణి, గబ్బెట బాబు, భూక్యా క్రాంతి, చెన్నబోయిన రవియాదవ్, ఎల్కపల్లి రమేశ్, గజవెల్లి అనంత, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



రాయపర్తి : పార్టీలో చేరిన కొలన్‌పల్లి యువకులతో మంత్రి ఎర్రబెల్లి



రాయపర్తి : పార్టీలో చేరిన మహబూబ్‌నగర్ గ్రామస్తులతో మంత్రి ఎర్రబెల్లి

## 'నేడు పల్లెపల్లెకూ దయాకర్‌రావు' కార్యక్రమం

**దేవరుప్పుల మండలంలో పర్యటించనున్న మంత్రి ఎర్రబెల్లి**

దేవరుప్పుల, నవంబర్ 15 : మండలంలో ''గడపగడపకూ బీఆర్ఎస్, పల్లెపల్లెకూ దయాకర్‌రావు'' కార్యక్రమం గురువారం జరుగుతున్నట్టు పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ తెలిపారు. ఉదయం 8గంటలకు రాంచంద్రాపురం, 9గంటలకు పెదతండా, 10గంటలకు చిప్పరాళ్లబండతండా, 11 గంటలకు నల్లకుంటతండా, 12గంటలకు రాంభోజీగూడెం, ఒంటిగంటకు చౌడూరు, 3గంటలకు కోలుకొండ, 4గంటలకు అప్పిరెడ్డిపల్లి, 5గంటలకు చినమడూరు, 6గంటలకు బంజర గ్రామం, రాత్రి 7గంటలకు సింగరాజుపల్లిలో ఉంటుందని ఆయన తెలిపారు. కాగా గ్రామాల మధ్య బీఆర్ఎస్ యూత్ బైక్ ర్యాలీ ఉంటుందని దయాకర్ తెలిపారు.



ధరావత్ తండాలో ప్రచారం చేపట్టిన బీఆర్ఎస్ శ్రేణులు

## దేవరుప్పులలో బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం

దేవరుప్పుల, నవంబర్ 15 : మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ బుధవారం ఇంటింటా ప్రచారం చేపట్టింది. ధరావత్ తండా, సింగరాజుపల్లి, నీర్మాల, రామరాజుపల్లి, దేవరుప్పుల, కామారెడ్డిగూడెం, పడమటి తండాల్లో పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ మ్యానుఫెస్టోను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. దయాకర్‌రావు చేసిన అభివృద్ధి, కేసీఆర్ పథకాలను వివరిస్తూ కారుగుర్తుకు ఓటేసి మంత్రి దయాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ధరావత్ తండా ఇన్‌చార్జి కొత్త జలేందర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు దేవానాయక్, సర్పంచ్ గేమానాయక్ కార్యకర్తలతో కలిసి ఇళ్లిల్లూ తిరిగారు. కార్యక్రమంలో ధరావత్ తండా గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి మధుకర్, అంగోత్ రాజు, బిచ్యా, నవీన్, సందీప్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## నేడు బూత్ కన్వీనర్ల సమావేశం

రాయపర్తి, నవంబర్ 15 : పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని బృందావనం గార్డెన్స్‌లో గురువారం ఉదయం 10గంటలకు పాలకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల బీఆర్ఎస్ బూత్ స్థాయి కన్వీనర్ల ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బూత్ స్థాయి కన్వీనర్ల సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల్లోని బూత్ స్థాయి కన్వీనర్‌లు విధిగా హాజరు కావాలని కోరారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై ఎన్నికల్లో బూత్ స్థాయి కన్వీనర్‌లు పాటించాల్సిన పద్ధతులు, నియమాలు, నిబంధనలపై దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

రాయపర్తి, నవంబర్ 15 : మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన ఏల్పుగొండ ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఎల్లయ్య కుటుంబ సభ్యులను గురువారం సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య పరామర్శించారు. కుటుంబానికి 70కేజీల బియ్యం అందజేశారు. ఆయన వెంట గ్రామ వార్డు సభ్యుడు మొర్రి రాజేందర్, గ్రామస్తులు ఉన్నారు.



బీఎస్ఎఫ్ సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ సీతారాం

## ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండాలి

**బీఎస్ఎఫ్ సిబ్బందితో డీసీపీ సీతారాం**

పాలకుర్తి, నవంబర్ 15 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం స్టోర్ రూమ్‌లు, ఆర్వో కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని జనగామ డీసీపీ సీతారాం సూచించారు. బుధవారం మండల కేంద్రంలో సోమేశ్వరస్వామి సన్నిధిలోని సోమేశ్వర కల్యాణ మండపంలో బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ విడిది చేసిన సందర్భంగా ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ అధికారులు, సిబ్బందికి డీసీపీ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమస్యాత్మక ప్రాంతాల్లో గస్తీ చేపట్టాలన్నారు. ఆయన వెంట సీఐ విశ్వేశ్వర్, ఎస్సై శ్రీకాంత్, బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బిపిన్ జస్వాల్ పాల్గొన్నారు.

## 'ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి'

తొర్రూరు, నవంబర్ 15 : ప్రలోభాలకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని వినియోగదారుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఠాకూర్ తన్‌సింగ్ అన్నారు. వినియోగదారుల ఫోరం ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలోని ఆర్యభట్ట పాఠశాలలో ఓటు చైతన్యంపై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు హక్కు వజ్రాయుధమని, ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. మంచి నేతను ఎన్నుకునేందుకు ఓటు కీలకమన్నారు. కేవలం 40నుంచి 70శాతం ఓట్లు మాత్రమే వేస్తున్నారని, ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకుని మంచి అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు గిరగాని సుదర్శన్‌గౌడ్, రాధాకృష్ణమూర్తి, స్వరూప, ఆర్యభట్ట పాఠశాల కరస్పాండెంట్ ఎన్ మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వినియోగదారుల ఫోరం ప్రతినిధులు

## రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ



సుధాకరాచారి



యాకూబ్‌రెడ్డి

తొర్రూరు, నవంబర్ 15 : రాష్ట్రోపాధ్యాయ సంఘం మహబూబాబాద్ జిల్లా నూతన కమిటీని బుధవారం తొర్రూరు పట్టణం లోని హైస్కూల్‌లో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా భూపాలపల్లి ప్రధాన కార్యదర్శి కే ప్రవీణ్‌కుమార్, పరిశీలకుడిగా రాష్ట్ర కార్యదర్శి ఎస్ కృష్ణయ్య పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా కొరవి సుధాకరాచారి, ప్రధాన కార్యదర్శిగా జీ యాకూబ్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా జీ యాకయ్య, టీ చంద్రప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా డీ చంద్రమౌళి, మహిళా ఉపాధ్యక్షురాలు కే శకుంతల, కార్యదర్శులుగా బీ సంపత్‌కుమార్, ఈ ఏకాంబ్రచారి, ఆర్థిక కార్యదర్శి ప్రభాకర్‌రావు, సభ్యులు బీ హరికృష్ణాచారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- నియోజకవర్గంపై అవగాహన లేని వారికి ఓటు అడిగే హక్కు లేదు
- ఎన్నికల ప్రచారంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్ నవంబర్ 15 : వచ్చిరాని హామీలతో ప్రజలను ఆగం పట్టించాలని చూస్తూ ఈ ప్రాంతంపై కనీస అవగాహన లేని కాంగ్రెస్ అభ్యర్థిని చిత్తుగా ఓడించి అభివృద్ధి పక్షాన నిలబడి ప్రజలు తనను మరోసారి ఆశీర్వదించాలని పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రజలకు పిలుపునిచ్చారు. పాలకుర్తి మండలంలోని సిరిసన్నగూడెం, కంబాల కుంట తండా, చీమలబావి తండాల్లో బుధవారం మంత్రి ఎర్రబెల్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తండా వాసులు డప్పుచప్పుళ్లు, కోలాటాలు, బోనాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. తండావాసులను కలిసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు తండాల్లో సీసీ రోడ్లు వేశామన్నారు. ఇంటింటికీ మిషన్ భగీరథ పథకం ద్వారా తాగు నీరు అందించినట్లు తెలిపారు. పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం శిక్షణ, ఉచిత జాబ్ మేళాలు, ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించినట్లు తెలిపారు. కరోనా కష్టకాలంలో ప్రజల మధ్య ఉంటూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని గుర్తు చేశారు. ఆనందయ్య మందు తెచ్చి కూడా ప్రజలకు ఉచితంగా అందజేశానన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా చెప్పుకునే వారికి ఈ ప్రాంతంపై కనీస అవగాహన ఉందా..? అని ప్రశ్నించారు. డబ్బులు వెదజల్లి గెలుస్తామని గాంభీర్యాన్ని ప్రదర్శించే అలాంటి వారిని ఓడించి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఎన్నికల్లో ఓడిపోతే కాంగ్రెస్ అభ్యర్థి అమెరికాకు తిరుగు పయనం అవుతుందన్నారు. అలాంటి వారికి కాకుండా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ అభివృద్ధి చేస్తున్న తనను, తెలంగాణ రూపురేఖలు మార్చిన బీఆర్ఎస్ పార్టీని గెలిపించి సీఎం కేసీఆర్‌కు అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఆవుల రవి, మాజీ అధ్యక్షుడు ఒంటెల శ్రీనివాస్‌రెడ్డి, ఒంటెల మాధవి, బానోత్ రాంచందర్, రాములమ్మ, మోతీలాల్, జర్పుల కోటేశ్వర్, లకావత్ నాగరాజు, ఇన్‌చార్జీలు పాము శ్రీనివాస్, దొంతమల్ల గణేశ్ పాల్గొన్నారు.



కంబాలకుంట తండాలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు